

# ప్రతీకారం

- వనిత -

నేను డాక్టర్ కావాలనుకున్నాను. కాని కాలేకపోయాను. అలాగని యాక్టర్ నయ్యా ననుకుంటారేమో.. అదేమీకాదు.

నేను రచయిత్రిని అవ్వాలనీ అనుకోలేదు. అయినా కావలసివస్తోంది. మానవ సమాజం. మన సమాజం.. అత్యంత ప్రమాదకరమూ భయంకరమూ అయిన పరిస్థితి నెదుర్కోవలసి వస్తుందన్న సూచన అందితే— నలుగురినీ ముందుగా హెచ్చరించవలసిన బాధ్యత... హెచ్చరిక చేసే అర్హత.. ప్రతివారికీ ఉంటాయని నేను త్రికరణ శుద్ధిగా నమ్ముతాను.

అందుకే ఇది రాయడం. రచనా నైపుణ్యం అలవడని దానను కనుక పాఠకుల పఠనా సౌలభ్యం కోసం.. విషయాన్ని నేనుగా చెప్పడం కంటే.. జరిగిన దానిని సాధ్యమైనంతవరకూ యథాతథంగా చూపడమే నయమనుకుంటున్నాను.

పదిహేనేళ్ళ క్రితం ఇద్దరు సహాయకులతో నేనీ స్కానింగ్ సెంటర్ ప్రారంభించాను. నేను మహిళని కావడం వల్ల నేమో మహిళా పేషంట్లు చాలా మంది నా సెంటర్‌కే వచ్చేవారు. నగరంలో స్కానింగ్ సెంటర్లింకా చాలా ఉన్నా స్వయంగా డాక్టర్ని కాలేకపోయినా.. రోగుల బాధలకు మూలాన్ని కనిపెట్టడంలో సహకరించి వారికి సేవ చేయగలుగుతున్నాను కదా అని తృప్తి చెందేదాన్ని. గుడ్డికంటె మెల్లయినా మేలే

కదా? అయితే రానురానూ నాకు నా పనిలో సంతృప్తి తగ్గుముఖం పడుతూ అసంతృప్తి పెరగ సాగింది. అందుకు కారణం ఆర్జన తగ్గడం ఎంత మాత్రమూ కాదు. ఆమాటకొస్తే నా సంపాదన నెలనెలకీ పెరుగుతూనే ఉంది. మరేమంటే.. నా వద్దకు స్కానింగ్‌కి వచ్చే కేసులలో లింగనిర్ధారణ పరీక్షలకై వచ్చే వారి శాతం పెరిగిపోతూండడం. అదే నన్ను బాధించసాగింది. శస్త్రచికిత్సతో దుష్టాంగంబు ఖండించి రోగికి ప్రాణంపోయవలసి తన కత్తిని ఆ రోగిని పీకనరికి చంపడానికి వినియోగించమంటే ఆ శస్త్ర వైద్యుడిలో కలిగే సంఘర్షణ వంటిదే. నాలోనూ కలగసాగింది. గర్భస్థ శిశువు పరిస్థితి ఎలా ఉందో... నేను రిపోర్టు రాస్తే దానిని బట్టి మాతా శిశువుల క్షేమానికీ, సుఖప్రసవానికి తగిన ముందు జాగ్రత్తలు తీసుకోగలుగుతారు డాక్టర్. కానీ స్కానింగ్ దాని కోసం కంటె గర్భస్థ శిశువు లింగనిర్ధారణ కొరకే ఎక్కువ మంది కోరుతున్నారు. శిశువుగా రూపొందుతున్న పిండం స్త్రీలింగమని నా రిపోర్టు చెబితే.. నా స్కానింగ్ సెంటర్ నుంచి నేరుగా ఎదురుగా ఉన్న హ్యాపీ క్లినిక్‌కి పరుగెడతారు. అక్కడ భ్రూణ హత్య జరిగిపోతుంది. ఫీజు చెల్లించగానే. ఈ గర్భస్రావాలకూ.. భ్రూణ హత్యలకూ... నేనూ కొంతవరకు కారణమే అనీ, ఈ పాపంలో నాది భాగస్వామ్యమే అనీ.. నేను స్త్రీనయి ఉండి కూడా నా స్త్రీ జాతి వృద్ధి చెందకుండా శత్రుపక్షంలాటి మగజాతితో చేతులు కలుపుతూ స్త్రీకి వెన్నుపోటు పొడుస్తున్నానేమో అనీ నాలో సందేహాలు., సంఘర్షణ, పాపచింతన, ద్రోహభావన మొదలయ్యాయి. అయితే నన్ను తీవ్రంగా భయపెడుతున్నాయి. జాబ్ శాటిస్‌ఫాక్షన్ సంగతి దేముడెరుగు, వృత్తి ఇలా బూచిలీ బెదిరిస్తుంటే ఎలా? స్త్రీనవడం వలన నేను ఎక్కువ సున్నితంగా ఆలోచిస్తున్నానా?

గర్భవతులయ్యేది స్త్రీలే కనుకా.. స్కానింగ్ చేసే నేనూ స్త్రీనే కనుక కాబోలు సెక్స్‌డిటర్మినేషన్ టెస్ట్ కేసులు నా వద్దకే అధికంగా వస్తున్నాయి. నేనెంత వొద్దనుకుంటున్నా. బ్రతుకుతెరవు కోసమయితేనేం, బాధ్యత కొద్దీ అయితే ఏం, నేను స్కానింగ్ చెయ్యాలి. వారి సందేహాలకు సమాధానాలు చెప్పాలి. పుట్టబోయే స్త్రీని మట్టుపెట్టే మారణకాండలో నా పాపభాగం నేనూ పంచుకోవాలి. ఎంతబాధగా ఉన్నా.

ఈ అమానుష శిశుహత్యలకు కారణాలు కొన్నయినా నాకు తెలుసు. ఈవ్ టీజింగ్ .. ఏ ఇంట్లో అయినా ఆడపిల్ల ఉంటే ఆ ఇంటిచుట్టూ బీట్లు కొట్టి అబ్బాయిలు కలిగించే న్యూసెన్సు.. ఆడపిల్ల కన్నవారి గుండెలమీంచి తొలగించిపారేసుకోవలసిన నిప్పుల కుంపటో, గ్యాస్‌స్టవ్వో కావడం, వరకట్నం... పెళ్ళయ్యాక కూడా మళ్ళీ మళ్ళీ కట్నకానుకల కోసం వేధింపులు .. కిరసనాయిలు పోసో, గ్యాస్ లీక్ చేసో కొత్త కోడలిని నిర్దాక్షిణ్యంగా చంపడం, భర్త దౌష్ట్యం , బానిస అనే పదానికి భార్య పర్యాయపదం కావ



"డాక్టర్! ఈ ఆపరేషన్‌తో నేను బతికిబయటపడగలనా?" అడిగాడు పేషెంట్.

"ఏం! నీక్కూడా అనుమానమా?" అడిగాడు డాక్టర్.

పి.సురేష్‌కుమార్, హైదరాబాద్

డం... వీటన్నికంటే ముఖ్యంగా మనుషులు తమ సంతానం విషయంలో కూడా లాభనష్టాల ధోరణిలో.. వ్యాపార దృక్పథంతో.. మగ పిల్లవాణ్ణి ధనధ్రువంగానూ ఆడపిల్లను రుణధ్రువంగానూ తప్ప చూడలేని హ్రస్వదృష్టి పీడితులు కావడం.. ఇన్ని కారణాలున్నాయి ఈ స్త్రీ శిశుహత్యల వెనుక. ఇవి మీకు తెలియనివేమీకావు. నేను చెప్పదలుచుకున్నదీ సామాజిక రుగ్మత గురించి కాదు. అవసరమున్నా లేకపోయినా స్కానింగ్ చేయించమని రాస్తూ డాక్టర్లు, చేస్తూ స్కానింగ్ , సెంటర్లు... దొంగలూ దొంగలూ కలిసి ఊళ్ళు పంచుకున్నట్లు డాక్టర్లు స్కానింగ్ సెంటర్లూ కలసి పేషంట్లను దోచుకునే దోపిడీ కథల గురించి అసలే కాదు. అంతకంటే కూడా పెద్దముప్పుగురించి.

ఆమధ్య లింగనిర్ధారణ పరీక్షల మీద ప్రభుత్వం చట్టపరమయిన ఆంక్షలు విధించేసరికి తొందరపడి, అమాయకంగానూ, నేనెంతో ఆనందించేశానిక ఈ పాపమూ పీడా తప్పుతాయని. నేను మరిచిపోయాను. చట్టాన్ని తయారుచేసే వారి కంటె ప్రబుద్ధులు చట్టానమలు పరచవలసిన ప్రజలోనే ఉంటారనీ, ఒట్టువేసే వారి కంటె తెలివైన వారు వొట్టుని తీసిగట్టుమీద ఇట్టే పెట్టియ్యగలరనీ, అవ్వపేరే ముసలమ్మ అనే తీరులో —పేరు మార్చుకుని మునుపటిమల్లేనే ఆకేసులు వొస్తూనే ఉన్నాయి. నన్ను వెదుక్కుంటూనూ, పరీక్షకీ మానసిక హింసకీ గురిచేస్తూనూ.

మొన్న ఒకామె వచ్చింది— భర్తతో కలిసి ఆమె వైఖరి కొంచెం ప్రత్యేకంగా ఉంది. లేదా.. నా కిలా అనిపించిందేమో. మనసులో అగ్ని పర్వతాలను దాచుకుని ముఖంలో మందహాసం చిందించడమంటారే.. అలా కనిపించిందామె నా కళ్ళకి. ఈమెతో జాగ్రత్తగా వ్యవహరించమని నా సిక్స్త్ సెన్స్ చెప్పింది. ఆమె భర్త స్కానింగ్ ఛార్జెస్ చెల్లించినట్లు రసీదు నాకందించాడు. నేనామె వైపు చూశాను. నా వెనుకే రమ్మన్నట్లు ఆమె భర్త విజిటర్స్ లౌంజ్‌లో కూర్చున్నాడు.

రూమ్‌లోకి వచ్చాక యథాలాపంగా అడిగాను. మీ పేరు? "చైతన్య... ఆఁ డాక్టర్ మీ రిపోర్టు రిజల్టు అదే.. గర్భస్థ శిశువు ఆడో మగో అన్నది. ముందునాకే చెప్పాలి. మా వారి కంటే కూడా ముందుగా. నాకే ప్లీజ్.." అర్థిస్తున్నట్లు షరతు విధిస్తున్నట్లూ కూడా ఉందామె కంఠం. అలాగే అన్నట్లు చిరునవ్వుతో తలూపుతూ టేబులుమీద వెల్లకిలా పడుకోమన్నాను. అతను భర్తే అయినా అతనికంటె ముందు తాను తెలుసుకోవాలిట! దాంపత్యాలు పలురకాలు. పుర్రె పుర్రెకూ ఓ బుద్ధి. స్కానింగ్ అయిపోయింది. థియేటర్ లోంచి నా రూమ్‌లోకి నడుస్తూంటే. నావెనుకే చైతన్య. రిపోర్ట్ తయారు చేసేటప్పుడు నా పక్కన ఎవరినీ ఉండనివ్వను. సాధారణంగా. కాని ఈమె నా నియమానికి సడలింపయింది. నాకు కొంచెం దూరంగా ఒక బల్లమీద కూర్చోమని నేను రిపోర్ట్ తయారు చేయసాగాను.

'కంగ్రాట్యులేషన్స్... మగబిడ్డే...'

ఆమె ముఖం ఒక్కసారి మాడిపోయింది. నేను ఆశ్చర్యపోయాను. ఆమెకు సరిగా వినపడలేదేమో అని—" మగబిడ్డ... మీకు పుట్టబోయేది— మగబిడ్డ." నొక్కి వక్కాణించాను.

ఆమె ఒక్కసారిగా హిస్టీరిక్‌గా అరిచింది. 'నో! అలా కాకూడదు. డాక్టర్! ఐ డోంట్ వాంట్ మేల్ ఫీటస్.'

నేను నివ్వెరబోయాను. ఈమె అంటున్నదేమిటి? ఆడవాళ్ళూ మగవాళ్ళూ కూడ మగబిడ్డే జన్మించాలని తపస్సే చేస్తున్న ఈ రోజులలో... అలాంటి అదృష్టం లభించబోతూంటే ఈమె ఏమిటి ఇలా విరుచుకుపడుతూంది? నాకేమిటో అయోమయంగా ఉంది.

'చక్కగా అబార్షన్ చేసే డాక్టర్ పేరు సూచించండి..'

వెర్రి మొహంవేసి చూశానామెవేపు. 'ఇంతవరకూ... ఆడ పిల్ల పుట్టబోతుందంటేనే అబార్షన్ చేయించుకునేవారు..' గొణిగాను మెల్లగా.

'ఓ!..' ఒక్కసారి నిట్టూర్చి... 'ఇక్కడికి బయలుదేరేముందు ఆ రోగి.. నా భర్త.. పెట్టిన షరతేమిటో తెలుసా?' తీవ్రంగా అడిగింది.

'నేనూహించగలను. పుట్టబోయేది ఆడపిల్ల అయ్యేటట్లయితే అటునుంచటే అబార్షన్‌కి నడవాలని...ఏం?

'ఎగ్జాట్లీ.'

'ఆడ శిశువు కాదుకదా... ఇకనేం?'

'ఆడ శిశువు కాదు. అందుకే'... 'డాక్టర్! నాదో రిక్వెస్ట్..'

'ఏమిటి?'

'మీ రిపోర్టు మార్చండి... ఫీటస్ ది స్త్రీ లింగమని..'

'నాటెటాల్. నేను అబద్ధమాడను. ఇప్పుడా అవసరమూ లేదు నిజానికి...'

నాకు తెలియకుండానే నా కంఠం కొంచెం కఠినమయినట్లయింది.

'మీరు దయచేసి వినగలనంటే... నా కథ... టూకీగానే... ప్లీజ్..'

'ఆల్‌రైట్ ... చెప్పండి....

'వరకట్నాన్నీ.. పురుషాధిక్యతని ప్రోత్సహిస్తూ అనుమతిస్తున్న ఈ సమాజమన్నా మగవాళ్ళన్నా, నాకు అసహ్యమూ, ద్వేషమూ, పగా, కసీ... అన్నీను...'

'మీరెందుకు వివాహం చేసుకున్నారు— మగవాడిని?'

'ఆడదాన్ని కనుక. విధి లేక.. గత్యంతరంలేక.. మా అమ్మనాన్నల నెత్తిమీద కత్తిలా వేలాడలేక. మధ్య తరగతి కుటుంబాల్లోని ఆడపిల్లకి ఇష్టాఇష్టాలూ, అభిమానామూ, ఆలోచనలూ, వ్యక్తిత్వమూ ఏమీ చెల్లవు మరి...'

'ఊఁ'

'నా హస్‌బెండ్ ఒక రోగ్. నిజంగా నాకు వాడంటే వొళ్ళు మంట. నాపట్ల వాడి ప్రవర్తన అలా ఉంటుంది. వివరాలు చెప్పను. మీరే అర్థం చేసుకోండి. వాడంటే నీకెంత కసి మనసులో అంటే— ఇప్పుడు నాకు పుట్టబోయేది మగపిల్లవాడని తెలిసిందో అదంతా తన ప్రతాపమే అని ఆనందంతోనూ, గర్వంతోనూ పెట్రేగిపోతాడు. వాడలా సంతోషించడం నాకిష్టంలేదెంతమాత్రమూ.'

'కాని... శాస్త్రీయమైన సత్యమేమిటంటే... మగవాడి క్రోమోజోమ్ ఫీటస్‌యొక్క లింగాన్ని నిర్ధారిస్తుంది.'

'సైన్స్ చెప్పేదేమైనా కానివ్వండి.. నా మొగుడు.. ఆ మగాడు, ఆ బ్రూట్ ఆనందించకూడదంతే.. ఆమె కళ్ళల్లో ఎంత ద్వేషం! ఎంత అసహ్యం! ఎంత పగ! ఆ భార్యాభర్తల మధ్య తక్కువ జరిగి ఉండదు. అతనీమెను తక్కువ బాధించి ఉండదు. లేకపోతే ఒక మనిషిపట్ల మరో మనిషికి ఇంత అసహ్యం ఏర్పడదు.

'అంత ఇష్టంలేని వాడితో కాపురమెందుకు చేయాలి?

'ముందే చెప్పానుగా.. ఈ దేశంలో ఆడదాని ఇష్టా ఇష్టాలు చెల్లవు. భర్త అనబడే మగవాడెంత నీచుడో మానవత్వం లేనవాడో అతనితో కాపురం చేయవలసివొచ్చిన ఆడదానికే తెలుస్తుంది. నూటికి తొంబై మంది ఆడవాళ్ళు మొగుడి మీద ఎంత మంటగా ఉన్నా తప్పనిసరి అయి సంసారంలో బందీలుగా మిగిలిన వాళ్ళే. స్వతంత్రంగా బతకగలిగే అవకాశమే నాకుంటే చచ్చినాసరే ఈ నీచుడితో సంసారం చేసేదాన్నా? స్త్రీ అవడమన్న ఒకే ఒక్క అనర్హతవలన నా తెలివి తేటలూ, ఆత్మాభిమానమూ, అన్నీ అణగద్రొక్కబడుతున్నాయి. పురుషత్వం అనే ఒక్క కారణం ముందు నేను బలాదూరు చేయబడుతున్నాను. ఇద్దరూ మానవజాతే అయినా స్త్రీ పురుషుల మధ్య ఇంత వ్యత్యాసమూ, విచక్షణా అనుమతిస్తున్న ఈ సమాజమన్నా నాకు తగని మంటే. ఆడ పిల్లలకు స్థానమూ, విలువా ఇవ్వని ఈ సమాజం మగవాడిని—శిశువు దశనుంచీ నెత్తికెక్కించుకోడం విచక్షణకాదూ? ఆడ శిశువులక్కర్లేదంటూ భ్రూణ హత్యలు చేసే ఈ సమాజానికి.. మరో మగవాడినిచ్చి. నా జాతికి అన్యాయం చేయడం నాకేమాత్రమూ ఇష్టంలేదు. సరే.. మాడమ్! మీ రిపోర్ట్‌లో ఆడపిల్ల అని రాస్తే.. వాడదిచూసి.. వెంటనే నాకు అబార్షన్ చేయిస్తాడు. అబార్షన్ అయిపోయిన తక్షణం నేను ఆనందంగా నవ్వుతూ నిజం చెబుతాను. అప్పుడు వాడు వేసే వెర్రి మొహమూ, వెధవ మొహమూ చూడడానికెంత సంతోషంగా ఉంటుందో నాకు! నువ్వు ఆడపిల్లలని చంపే మగాడివైతే.. నేను మగపిల్లల్ని చంపే ఆడదాన్ని. అని వికటాట్టహాసం చేస్తాను.'

తెల్లబోయాను. ఆమెకు భర్తమీద ఎంత ద్వేషం గూడుకట్టుకుందో మరింత అర్థమయింది. కాని... ఆమె ఆలోచనా ధోరణి సవ్యమయినది కాదనిపిస్తోంది. స్త్రీ పురుషులు.. ఒకరిమీదొకరు కసితో... పుట్టబోయే బిడ్డలను నాశనం చేయడం ఏం న్యాయం?

'కాని... నేను. అబద్ధం రాసి... నా వృత్తికి కళంకం తెచ్చుకోను.. సారీ.'

'సరే.. రిపోర్టిచ్చెయ్యండి..స్త్రీకి ప్రథమ శత్రువు స్త్రీయే అని మీరూ నిరూపిస్తున్నారు.' ఎత్తిపొడుస్తున్నట్లే అంది. నేను మౌనంగా రిపోర్ట్ అందించేశాను.

ఆమె—దానిని నాకళ్ళముందే.. అక్కడే.. అతి చిన్న ముక్కలుగా చించి డస్ట్ బిన్‌లో వేసేసింది. నాకు అవమానమనిపించినా... కోపమొచ్చినా.. నిగ్రహించుకున్నాను. ఆమె వెనుకే నేనూ నడిచాను.. ఏం జరుగుతుందో చూద్దామని.

'ఏదీ రిపోర్టు?' ఆత్రంగా అడిగాడామె భర్త.

'చింపి పారేశాను—' నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చలంగా అంది.

'ఆ!'

'ఔను చావు టెలిగ్రాంని ఎవరు మాత్రం భద్రంగా దాచుకుంటారు?

అర్థమయిందిగా? పదండి అబార్షన్ సెంటర్‌కి'

'పోనీలే.. విచారించకు. ఆడపిల్లకంటే పిల్లలు లేకపోడమే నయం'అంటూ 'ఎందుకయినా మంచిదని ముందే కనుక్కొని ఉంచాను.. కీడెంచి మేలెంచమని అన్నారు పెద్దలు! ఎదురుగా హ్యాపీ క్లినిక్ ఉంది. అక్కడ అందంగా అబార్షన్లు చేయపడతాయట. పద పద...'

ఒక్కసారి చైతన్య వెనక్కి తిరిగి—నావేపు చూసి నవ్వి—కదిలింది. విజేతలా.

నాకు నవ్వు రాలేదు. భయం వేసింది.

ఇలాగ—మగవాళ్ళు అడ శిశువులనీ, ఆడవాళ్ళు మగ శిశువులనీ సమాజంలోకి రానివ్వకుండా చేస్తూపోతే—కొన్నాళ్ళకి ఈ సమాజ స్వరూపం ఎలా ఉంటుంది? అసలు—మానవ సమాజముంటుందా?

●

"తుపాను బాధితుల సహాయార్థం మేము ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చాము!" గొప్పగా చెప్పుకున్నాడు వంశీ. "ఓస్ అంతేనా? మేమయితే ఒక రోజు సంపాదించే మా లంచాన్నే విరాళంగా ఇచ్చాం తెలుసా?" తాను గొప్పగా చెప్పుకున్నాడు మురళీ.

పి.సురేష్‌కుమార్, హైదరాబాద్



"మీ తరం వాళ్ళకి సిగ్గు, అణకువ లేవు. నేను కాలేజీకెళ్ళే రోజులలో నీ వయసు అమ్మాయిలు ఎంత సిగ్గుపడేవారో?" అన్నాడు తండ్రి.

కూతురు కొద్ది క్షణాలు ఆలోచించి "వాళ్ళు సిగ్గుపడేలా మీరేం చేసేవారు డాడీ" అనడిగింది.

పి.సురేష్‌కుమార్, హైదరాబాద్

